క్లుప్తంగా

బాలాజీనగర్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా చౌదరి కృష్ణ

కూకట్‌పల్లి: బాలాజీనగర్ డివిజన్ ప్రజల పక్షాన నిలబడి ప్రజా సమస్యలపై పోరాడతానని డివిజన్ అధ్యక్షుడిగా నియమితులైన చౌదరి కృష్ణ రాజ్‌పుత్ అన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి మేడ్చల, మల్కాజ్‌గిరి జిల్లా అధ్యక్షుడు నందిగంటి శ్రీధర్, మాజీ కార్పొరేటర్ గొట్టిముక్కల వెంగళరావు, నియోజకవర్గ నాయకులు సత్యం శ్రీరంగంలకు ధన్యవాదాలు తెలుపుతున్నానని అన్నారు.

ఫతేనగర్ కాంగ్రెస్ కమిటీలో పలువురి నియామకం

బాలానగర్: ఫతేనగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కె. రమేష్ పార్టీలో వైస్ ప్రెసిడెంట్‌లు, జనరల్ సెక్రటరీలు, సెక్రటరీలు, జాయింట్ సెక్రటరీలు, ఆర్గనైజింగ్ సెక్రటరీల పదవులకు పలువురిని నియమించినట్లు మంగళవారం ఓ ప్రకటనలతో తెలిపారు. కాంగ్రెస్ పార్టీకి తెలంగాణలో పునర్వైభవం వస్తుందన్నారు. డివిజన్ కమిటీ విస్తరణలో అన్ని వర్గాలకు స్థానం కల్పించినట్లు తెలిపారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో కూకట్‌పల్లి కళాశాలకు ద్వితీయ బహుమతి



వేరుశెనగ విత్తనాలపై పరిశోధనలో బహుమతి అందుకున్న మైక్రో బయాలజీ విద్యార్థులు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి ప్రభుత్వ కళాశాలలో మైక్రో బయాలజీ విభాగానికి చెందిన విద్యార్థులు 2022–23 రాష్ట్ర స్థాయి పోటీల్లో తెలంగాణ ప్రాంతంలో వేరుశెనగ విత్తనాలతో వచ్చే వివిధ రకాల చీడ పురుగులు, వ్యాధులపై పరిశోధన చేసి సిద్ధాంత ఫలితాలను సమర్పించినందుకు కళాశాల విద్యాశాఖ ద్వితీయ బహుమతిని ప్రదానం చేసింది. ఈ పరిశోధన మైక్రో బయాలజీ విభాగాధిపతి ఆర్‌వీ రామచందర్ నేతృత్వంలో పరిశోధన జరిగింది. అదేవిధంగా ఈ పరిశోధనలో కళాశాలకు చెందిన ద్వితీయ సంవత్సరం విద్యార్థులు గౌసియా సమి, వి. హరినారాయణ, వేద ప్రకాష్‌మిశ్రా, ఎండీ ఆసిఫ్, సీహెచ్. విజయసారథి, టి. వైష్ణవి పాల్గొన్నారు. వీరికి రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ ఆర్. లింబాద్రి చేతుల మీదుగా జరిగింది. ఈ కార్యక్రమంలో కళాశాల విద్యాశాల రీజినల్ జాయింట్ డైరెక్టర్లు డా. జి.యాదగిరి, జాయింట్ డైరెక్టర్ డా. రాజేంద్రసింగ్, కళాశాల ప్రిన్సిపాల్ డా. అలివేలు మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

● హెచ్‌సీయూ వైస్‌చాన్స్‌లర్ ప్రొ.బీజేరావు

రాయదుర్గం: ఆరోగ్యం పట్ల ప్రతి ఒక్కరూ ప్రత్యేక శ్రద్ధ వహించాలని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ బీజేరావు సూచించారు. గచ్చిబౌలిలోని హెచ్‌సీయూ హెల్త్ సెంటర్‌లో బేసిక్ లైఫ్ సపోర్ట్ (బీఎల్ఎస్), ఫస్ట్ ఎయిడ్ ట్రెనింగ్ సెషన్‌ను మంగళవారం అపోలో ఆస్పత్రి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ముఖ్యంగా యువకులు శరీర ఆరోగ్యం, మానసిక ఆరోగ్యం అనే రెండు అంశాలపై దృష్టి పెట్టాలని సూచించారు.అందరూ బీఎల్ఎస్, ఫస్ట్ ఎయిడ్ ట్రెనింగ్ సెషన్‌లో అపోలో ఆస్పత్రి డాక్టర్ అహ్మద్ అలీ, డాక్టర్ యూజిత అవగాహన కల్పించడంతోపాటు పలు సూచనలు చేశారు. హెచ్‌సీయూలోని ఉద్యోగుల పిల్లల కోసం ఈ సెషన్‌ను ప్రత్యేకంగా నిర్వహించారు. వారిలో దాదాపు 40 మందికి బీఎల్ఎస్, ప్రథమ చికిత్స శిక్షణ అందించారు.

డెంగీపై అవగాహన ర్యాలీ



డెంగ్యూపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ప్రాథమిక అరోగ్య కేంద్రం సిబ్బంది

ఓల్డ్ బోయిన్‌పల్లి: జాతీయ డెంగీ డేను పురస్కరించుకుని మంగళవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. పీహెచ్‌సీ డాక్టర్ అస్రా డెంగీ బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు వివరించారు. లైన్స్‌టౌన్ కాలనీ, హస్మత్‌పేట, అంజయ్యనగర్, ఓల్డ్ బోయిన్‌పల్లి, మాలాబస్తీ మీదుగా ర్యాలీ కొనసాగింది. ఈ కార్యక్రమంలో స్టాఫ్ నర్సులు బాగ్య, లక్ష్మీ, మహేశ్వరీ, కీర్తి, ఎఎన్ఎమ్స్ శ్రావంతి, సంధ్య, సరితా, అశా, శ్రీదేవి, పోచమ్మ, అకౌంటెంట్ సునీల్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

దశలవారీగా శిక్షణ

రాయదుర్గం: ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా, సెయింట్ ఆన్స్ కాలేజ్ ఫర్ విమెన్ సహకారంతో సాఫ్ట్‌వేర్ స్కిల్ ట్రెనింగ్ ప్రోగ్రామ్‌ను ప్రారంభించినట్లు ఎస్కీ డైరెక్టర్ డాక్టర్ జి రామేశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొదటిసారిగా నగరంలోని సెయింట్ ఆన్స్ కాలేజ్ ఫర్ విమెన్ కళాశాలలో ఈ కార్యక్రమం నిర్వహించామని, దశలవారీగా మరిన్ని శిక్షణా కార్యక్రమాలను నిర్వహిస్తామని పేర్కొన్నారు.

స్పందించని జీహెచ్‌ఎంసీ.. ఇరుకు గదుల్లోనే పీహెచ్‌సీ



హస్మత్‌పేటలో నిరుపయోగంగా మారిన మోడల్ మార్కెట్ భవనం

- మోడల్ మార్కెట్‌ను ప్రారంభించి ఆరున్నరేళ్లు పూర్తి
- నేటికీ నిరుపయోగంగానే మార్కెట్ భవనం
- పీహెచ్‌సీని మార్కెట్‌లోకి మార్చాలని ప్రజాప్రతినిధులకు విజ్ఞప్తులు
- సానుకూలంగా స్పందించిన ఆరోగ్యశాఖ మంత్రి, ఎమ్మెల్యే
- అయినా స్పందించిన జీహెచ్‌ఎంసీ ఉన్నతాధికారులు

ఓల్డ్‌బోయిన్‌పల్లి: ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్ హస్మత్‌పేటలో నిరుపయోగంగా ఉన్న మోడల్ మార్కెట్‌లోకి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ) ఎప్పుడు మారుతుందని ప్రజలు ఎదురు చూస్తున్నారు. లైన్స్‌టౌన్ కాలనీలోని అద్దె ఇంట్లో కొనసాగుతున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి రోగుల తాడికి అధికం కావడంతో స్థల ప్రభావం వల్ల రోగులు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొంది. నిత్యం వచ్చే రోగులతో పాటు సిబ్బందికి. మందులను పెట్టుకోవడానికి స్థలం లేక ఇరుకు గదులలో నడిపిస్తూ కాలం వెల్లదీస్తూ వస్తున్నారు. ఇబ్బందులను గుర్తించిన ప్రజలు గతంలో స్థానిక ఎమ్మెల్యే, కార్పొరేటర్ దృష్టికి తీసుకెళ్లారు.

◆ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి నూతన భవనం నిర్మించేందుకు స్థలం లేదు. దీంతో నిరుపయోగంగా ఉన్న మోడల్ మార్కెట్ భవనంలోకి మార్చితే రోగులకు సౌకర్యవంతంగా ఉంటుందని కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్ స్థానిక ఎమ్మెల్యే, ఆరోగ్యశాఖ మంత్రి హరీష్‌రావు దృష్టికి తీసుకెళ్లారు. దీనికి సానుకూలంగా స్పందించిన మంత్రి అందులో పీహెచ్‌సీ ఏర్పాటు చేసేందుకు సుముఖత వ్యక్తం చేశారు.

స్పందించని బల్దియా అధికారులు

◆ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మోడల్ మార్కెట్‌కు మార్చాల్సి వస్తే ప్రత్యేక గదుల ఏర్పాటు, మెడికల్ స్టోర్‌రూమ్, రోగులకు సౌకర్యంగా ఉండేలా గదుల ఏర్పాటుకు తగిన చర్యలకు తీసుకోవాలని పీహెచ్‌సీ అధికారి డీఎంహెచ్‌ఓ, జీహెచ్‌ఎంసీ అధికారులను కోరారు. దీనిపై డీఎంహెచ్‌ఓ సానుకూలంగా స్పందించగా జీహెచ్‌ఎంసీ అధికారులు మాత్రం నేటికీ స్పందించలేదు. దీంతో



ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లోపల స్థలం లేక బయట నిలబడిన రోగులు

చేసేంది లేక ఇరుకు గదుల్లోనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని నెట్టుకొస్తున్నారు.

మార్కెట్ భవనంలోకి మార్చితే...

మోడల్ మార్కెట్ భవనంలోకి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మార్చితే తెలంగాణ డయాగ్నస్టిక్ సెంటర్, మెడికల్ రూమ్, రోగులకు హాల్, ల్యాబ్ ఇతరత్రా సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని సిబ్బంది అంటున్నారు. ముఖ్యంగా ప్రజలకు 50 రకాల టెస్టులు నిర్వహించే డయాగ్నస్టిక్ సెంటర్



రోజుకు వందకు పైగా పెషేంట్లు, సోమవారం, శుక్రవారం ఏఎన్‌సీ చెకప్‌లకు తగిన స్థలం అందుబాటులోకి వస్తుందని అంటున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మోడల్ మార్కెట్‌లోకి మార్చితే సౌకర్యాంగా అన్నీ ఏర్పాట్లు చేసుకునేందుకు నిధులు విడుదల అవుతాయని ఆరోగ్య కేంద్రం సిబ్బంది చెబుతున్నారు.

ఎందుకీ నిర్లక్ష్యం...

ఆరోగ్య శాఖ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే, కార్పొరేటర్ సానుకూలంగా స్పందిస్తే అధికారులు ఎందుకింత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే అనుమానాలు తలెత్తుతున్నాయి. జీహెచ్‌ఎంసీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎందుకు స్పందించడం లేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. రోజురోజుకు పెరుగుతున్న రోగులకు కనీసం అద్దె భవనంలో 10మంది రోగులు వస్తే కూర్చోవడానికి స్థలం లేక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం బయట నిల్చోవాల్సిన పరిస్థితి అధికారులకు కనిపించడం లేదా అని ప్రశ్నిస్తున్నారు. ఇక గర్భిణుల పరిస్థితి మరింత ఘోరంగా ఉంటుందన్నారు. గంటల తరబడి ఆరోగ్య కేంద్రం బయట నిల్చోవడంతో ఇబ్బందులు తలెత్తున్నాయని వాపోతున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగులలో కోవిడ్, అంటు వ్యాధులు వచ్చిన వారు కూడా వస్తుండటంతో పీహెచ్‌సీకి వెళ్లలంటేనే భయమేస్తుందని రోగులు అంటున్నారు.

అధికారులు స్పందించేలా ఎమ్మెల్యే, కార్పొరేటర్ కృషి చేయాలి

ఇప్పటికైనా రోగుల ఇబ్బందులను గుర్తించి జీహెచ్‌ఎంసీ ఉన్నతాధికారులు స్పందించేలా, మోడల్ మార్కెట్ భవనంలోకి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వచ్చేలా ఎమ్మెల్యే, కార్పొరేటర్ తగిన చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. ప్రజల అభివృద్ధి కోసం నిరంతరం పాటు పడుతూ ప్రజల కోసం ఏదైన చేయడానికి వెనుకాడని ఎమ్మెల్యే రోగుల ఇబ్బందులను తొలగిస్తారని ఆశిస్తున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మోడల్ మార్కెట్‌లోకి మార్పించేందుకు తగిన చర్యలు తీసుకుంటారని ప్రజలు ఆశాబావం వ్యక్తం చేస్తున్నారు.

నాలా కబ్జాకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకుంటాం

ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

అల్విన్‌కాలనీ: డివిజన్ పరిధిలోని సాయినగర్ కాలనీలో నాలాను మట్టితో పూడ్చుతూ కబ్జాకు పాల్పడుతున్న విషయాన్ని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ స్థానికుల ద్వారా తెలుసుకున్నారు. ఈ మేరకు టౌన్ ప్లానింగ్, రెవెన్యూ సిబ్బంది, కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావుతో కలిసి ఆయన మంగళవారం నాలాను పరిశీలించారు.

◆ ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... నాలాను మట్టితో పూడ్చుతూ కబ్జాకు పాల్పడుతున్న వారు ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదన్నారు. వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అదే విధంగా నాలాను యథాస్థితికి తీసుకురావాలన్నారు. నాలాలో పేరుకుపోయిన మట్టిని తొలగించి నీటి ప్రవాహం సాఫీగా సాగేలా చూడాలని అధికారులకు సూచించారు.

◆ కొంతమంది స్వార్థపరులు నాలా కబ్జాకు పాల్పడటం దుర్మార్గపు చర్య అని అన్నారు. నాలాను కబ్జాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. నాలాలను సంరక్షించే బాధ్యత ప్రతి ఒక్కరిదన్నారు. నాలాలు కనుమరుగైతే భవిష్యత్ అంధకారం అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో టీపీఎస్ సోమేష్, వీఆర్‌ఏ ధనరాజ్, నాయకులు ఎర్రగుడ్ల శ్రీనివాస్‌యాదవ్, బీఆర్ఎస్ నాయకులు ఎండీ ఇబ్రహీం, శివ, మాధవ్, రాజ్యలక్ష్మి, కాలనీవాసులు పాల్గొన్నారు.



సాయినగర్‌లో కబ్జాకు గురైన నాలా ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే, అధికారులు, స్థానికులు

ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పిస్తాం



ప్రశాంత్‌నగర్‌లో సీసీరోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్

భాగ్యనగర్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని సాయి ప్రశాంత్‌నగర్‌లో 28 లక్షల రూపాయల అంచనా వ్యయంతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను మంగళవారం స్థానిక కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ హైదర్‌నగర్ డివిజ్‌లో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తామన్నారు. సీసీ రోడ్ల వంటి అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలతో చేపట్టాలని సూచించారు. నాణ్యత విషయంలో రాజీ పడకూడదన్నారు.

◆ ప్రజలకు ట్రాఫిక్ రహిత, సుఖవంతమైన, మెరుగైన రవాణా సౌకర్యం కోసం శాయశక్తుల కృషి చేస్తామన్నారు. ప్రజలకు స్వచ్ఛమైన, చక్కటి ఆహ్లాదకరమైన వాతావరణం కల్పిస్తామని తెలిపారు. పనుల్లో జాప్యం లేకుండా త్వరగా పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పిస్తామని, ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా సుఖవంతమైన ప్రయాణానికి బాటలు వేస్తామని తెలిపారు. డివిజన్ అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు రాజు, లక్ష్మి, నాయకులు మాధవ్, కుమారస్వామి, వర్క్ ఇన్‌స్పెక్టర్ మహదేవ్ తదితరులు పాల్గొన్నారు.

డబుల్ ఇళ్లకు స్థలం లేదని ఇప్పుడు గుర్తొచ్చిందా?

మేడ్చల్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు వన్నాల హరీష్‌రెడ్డి

కూకట్‌పల్లి: ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో కేంద్రాన్ని డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల కోసం స్థలం ఇవ్వమని అడగటం ఎమ్మెల్యే కృష్ణారావు తన ఓటమిని అంగీకరించినట్లేనని బీజేపీ నాయకులు తీవ్రస్థాయిలో విమర్శించారు. తొమ్మిది సంవత్సరాల పాటు అధికారాన్ని అనుభవిస్తున్న కృష్ణారావు డబుల్‌బెడ్ రూమ్ ఇళ్లకు స్థలం లేదని ఎన్నికల ముందు గుర్తుకొచ్చిందా అని ప్రశ్నించారు. కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డులో 100 ఎకరాల ప్రభుత్వ స్థలం ఉందని అందులో 18వేల డబుల్‌బెడ్ రూమ్ ఇళ్లు నిర్మించవచ్చని మేడ్చల్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు వన్నాల హరీష్ రెడ్డి తెలిపారు. మంగళవారం కూకట్‌పల్లి బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

◆ అక్రమాలన్నింటిని సక్రమాలుగా చేసే కృష్ణారావు పేదలకు డబుల్ బెడ్ ఇళ్ల విషయంలో చిత్తశుద్ధిని ప్రదర్శించటం లేదని ధ్వజమెత్తారు. గత ఎమ్మెల్యేల హయాంలో సెంటు భూమి కూడా కబ్జా కాలేదన్నారు. ఎమ్మెల్యే కృష్ణారావు హయాంలోనే వందల ఎకరాలు కబ్జాకు గురయ్యాయని ఆరోపించారు.

ఐడీపీఎల్ కంపెనీ స్క్రాప్ అంశంలో ఆరోపణలు సరికావు..

కూకట్‌పల్లి అసెంబ్లీ ఇన్‌చార్జి మాధవరం కాంతారావు మాట్లాడుతూ... బాలానగర్‌లోని ఐడీపీఎల్ కంపెనీ స్క్రాప్ అంశంలో బీఆర్ఎస్ పార్టీ జర్నలిస్టు జగన్‌మోహన్‌రావు చేస్తున్న తీవ్ర ఆరోపణలను సరికాదన్నారు. వాస్తవాలను ప్రజలకు తెలియజేసే బీఆర్ఎస్ పార్టీ మీడియా విభాగంలో పనిచేస్తున్న జగన్ తన తీరును మార్చుకోవాలని సూచించారు. మెటల్ స్క్రాప్ ట్రేడ్ కార్పొరేషన్ లిమిటెడ్ కంపెనీ 17 అక్టోబర్ 2019న ఐడీపీఎల్ సంస్థ ఈ స్క్రాప్ అమ్మకాలకు సంబంధించిన అంశంపై చేసుకున్న అగ్రిమెంట్‌ను ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు.

◆ దేశ వ్యాప్తంగా నలభై రెండు వివిధ రంగాల కొనుగోలుదారులను ఆహ్వానించగా 33మంది కొనుగోలుదారులు పాల్గొన్నారని తెలిపారు. కాగా మెటల్ స్క్రాప్ ట్రేడ్ కార్పొరేషన్ లిమిటెడ్ కంపెనీ ముంబాయి, మహారాష్ట్రకు చెందిన వారికి క్లియరెన్స్ ఇచ్చి విషయం బహుశా జర్నలిస్టు జగన్ మర్చిపోయారని అన్నారు. కాంతారావు వ్యాఖ్యానించారు. ఈ సమావేశంలో సూర్యప్రకాష్‌రావు, శ్రీకర్‌రావు, వడ్డేపల్లి శరణ్, ప్రతాప్‌రెడ్డి, వినోద్, మనోహర్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వన్నాల హరీష్‌రెడ్డి, మాధవరం కాంతారావు

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్‌లోని రామారావునగర్, హరినగర్‌లలో మంగళవారం స్థానిక కార్పొరేటర్ సబిహా బేగం పాదయాత్ర చేసి స్థానికుల నుంచి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కొంతమంది స్థానికులు సమస్యలను ఆమె దృష్టికి తీసుకువచ్చారు. వీటిని పరిశీలించి త్వరలో పరిష్కరిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు నాగుల సత్యం, సంజీవ, సుభాష్‌రెడ్డి, సాంబ, శివయ్య, ఎండీ నజీర్, ఎస్ఆర్‌పీ సురేష్, శివ, సాంబయ్య, కరుణాకర్, జగన్, నరసింహ, ఎం. రత్నం, యాదగిరి, ఏ గణేష్, శ్రీనివాస్, నజీమా, తాజ్‌బి, తదితరులు పాల్గొన్నారు.

భూమిపూజ

కూకట్‌పల్లి: ఎన్టీఆర్ శతజయంతి ఉత్సవాల్లో భాగంగా ఈనెల 20న జరిగే ప్రత్యేక సంచిక, వెబ్‌సైట్ ఆవిష్కరణ కార్యక్రమానికి కైత్లాపూర్ గ్రౌండ్ వేదికయ్యింది. ఈ మేరకు మంగళవారం కమిటీ చైర్మన్ టీడీ జనార్దన్ ఆధ్వర్యంలో భూమిపూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బాచిన సుబ్బారావు, సుబ్బారావు, రాజా, ఆలం శివ, కోటి,అరూప్, అచ్యుత్, శ్రీనివాస్, గోపి, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి పాదయాత్ర

బాలానగర్: బాలానగర్ డివిజన్ పరిధిలోని సత్తిరెడ్డి కాలనీ, వాణి సొసైటీల్లో కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి మంగళవారం పాదయాత్ర నిర్వహించారు. కాలనీ అసోసియేషన్ ప్రతినిధులను కలిసి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ రషీద్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

'మనూ'లో ప్రత్యేక ఉపన్యాసం, క్విజ్ పోటీలు

రాయదుర్గం: మనూ విశ్వవిద్యాలయం ఎన్‌సీసీ సబ్ యూనిట్ (తెలంగాణ ఆర్టీబీటీ హైదరాబాద్ గ్రూప్) జీ–20 యూనివర్సిటీ కనెక్ట్ ప్రోగ్రామ్‌లో భాగంగా ప్రత్యేక ఉపన్యాసం, క్విజ్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీలను మనూ పాలిటెక్నిక్ ప్రిన్సిపల్ డాక్టర్ యూసుఫ్‌ఖాన్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జీ–20 దేశాల అధ్యక్ష పదవి భారత్‌కు లభించడం ఎంతో ప్రాముఖ్యతను సంతరించుకుందన్నారు. ఈ సందర్భంగా దేశ వ్యాప్తంగా అనేక రకాల కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతోందన్నారు. అందులో భాగంగా కేంద్ర విద్యాశాఖ ద్వారా జీ–20 సంబంధిత రీడింగ్ మెటీరియల్‌పై క్విజ్ పోటీలను నిర్వహించారు. మనూ ఎన్‌సీసీ కేడెట్‌లు ఈ పోటీలలో పాల్గొన్నారు. మహ్మద్, అబ్దుల్ ముజీబ్, ఇతర సభ్యులు పాల్గొన్నారు.

ఐడీపీఎల్ స్క్రాప్ టెండర్‌ను రద్దు చేయాలి

● టీఎస్‌టీఎస్ చైర్మన్ జగన్‌మోహన్‌రావు



నిరసనకు సంఘీభావం తెలుపుతున్న జగన్‌మోహన్‌రావు, కార్పొరేటర్

కూకట్‌పల్లి: ఐడీపీఎల్ స్క్రాప్ టెండర్‌ను రద్దు చేయడంతో పాటు, శాశ్వత నివాసయోగ్యం కేంద్ర ప్రభుత్వం కల్పించాలని టీఎస్‌టీఎస్ చైర్మన్ జగన్ మోహన్‌రావు డిమాండ్ చేశబూరు. మంగళవారం ఐడీపీఎల్ ఉద్యోగుల నిరసన దీక్షలో ఆయన పాల్గొని సంఘీభావం తెలిపారు. ఐడీపీఎల్‌లో రూ.1000 కోట్ల కుంభకోణం జరిగిందని ఆరోపించారు. దీని వెనుక బీజేపీ జాతీయ నాయకుల హస్తం ఉందన్నారు. ఈ నిరసనలో కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

'తెలంగాణను ఆదర్శంగా తీసుకుంటున్నారు'



కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్ సబిహా బేగం

కూకట్‌పల్లి: అల్లాపూర్ డివిజన్‌కు చెందిన 153 మంది కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ లబ్ధిదారులకు మంగళవారం కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, అల్లాపూర్ కార్పొరేటర్ సబిహా బేగంతో కలిసి చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ అందిస్తున్న కల్యాణ లక్ష్మి పథకం బీజేపీ, కాంగ్రెస్ పాలిస్తున్న ఏ రాష్ట్రంలో అయినా అమలు చేస్తున్నారా అని ప్రశ్నించారు. తెలంగాణను చూసి ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులు ఆదర్శంగా తీసుకుంటున్నారని అన్నారు. అదే విధంగా అన్ని కులాలు, మతాల సంప్రదాయాలకు తగ్గట్టు ప్రోత్సాహకాలు అందించిన ఏకైక నాయకుడు కేసీఆర్ అని కొనియాడారు. అల్లాపూర్ డివిజన్‌లో ఇప్పటికే వందల కోట్ల రూపాయలతో రోడ్లు, డ్రైనేజీ, కమ్యూనిటీహాల్స్, పార్కులు నిర్మించామని తెలిపారు. కూకట్‌పల్లి నియోజకవర్గంలో ఇప్పటికే 15వేల కుటుంబాలకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను అందించామని ఆయన గుర్తు చేశారు.

నేతాజీనగర్‌లో యూజీడీ పనులకు శంకుస్థాపన

బాలానగర్: అభివృద్ధి పనులను వెంటనే చేపట్టి త్వరితగతిన పూర్తి చేయాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. ఫతేనగర్ డివిజన్ పరిధిలోని నేతాజీనగర్‌లో 68 లక్షల రూపాయల వ్యయంతో చేపట్టిన యూజీడీ పనుల మంగళవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ సతీష్‌గౌడ్ మాట్లాడుతూ.. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లిన వెంటనే స్పెషల్ బడ్జెట్ ద్వారా నూతన యూజీడీ పనులకు శంకుస్థాపన చేయటం సంతోషకరమైన విషయమన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కంచి భిక్షపతి, కె.రాములు, నర్సయ్య, వీరస్వామి, రాజ్‌కుమార్, సత్యనారాయణ, నందకుమార్,భాగయ్య, దత్తారావు, సల్లాద్దీన్, రహిమా, సురేందర్ నాయుడు, జయమ్మ తదితరులు పాల్గొన్నారు.



నేతాజీనగర్‌లో యూజీడీ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

శివరామాంజనేయ దేవాలయంలో ప్రత్యేక పూజలు

మోతీనగర్: దేవాలయం మానసిక ప్రశాంతతకు కేంద్ర బిందువని, ఆధ్యాత్మిక చింతనకు భక్తిభావం పెంపొందించడానికి ఎంతగానో దోహదపడతాయని టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు, ఉమ్మడి రాష్ట్ర ఖాదీ బోర్డు మాజీ చైర్మన్ గోపిశెట్టి నిరంజన్ పేర్కొన్నారు. మంగళవారం మూసాపేటలోని కబీర్‌నగర్‌లో పునర్ నిర్మించిన శ్రీశివరామాంజనేయ దేవాలయాన్ని ఆయన కుటుంబసభ్యులతో కలిసి సందర్శించి ఆలయంలోని పలు దేవతా విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ ప్రాంతంలో ఇటువంటి ఆలయంలో పునర్‌నిర్మాణం చేపట్టి పెద్ద దేవాలయంగా నిర్మించటం సంతోషించదగ్గ విషయమన్నారు. ఈ సందర్భంగా ఆలయ ప్రతినిధులను ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం కమిటీ సభ్యులు ఆయనను ఘనంగా సన్మానించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన సేవకుడు రమేష్ అయ్యంగార్, ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి గోపిశెట్టి రాఘవేందర్, స్థానిక నాయకులు వెంకటేష్ గాయారు, హనుమంతరావు గౌడ్, బాలరంగప్ప, చాణక్య, పి. సత్యనారాయణ గౌడ్ తదితరుల పాల్గొన్నారు.



పూజల్లో పాల్గొన్న టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు గోపిశెట్టి నిరంజన్

సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తా

మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్‌కుమార్

మూసాపేట: ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పని చేస్తున్నామని మూసాపేట మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్‌కుమార్ అన్నారు. కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆదేశాల మేరకు డివిజన్‌లోని భరత్‌నగర్ ఈడబ్ల్యూఎస్, మహేశ్వరి నగర్, శక్తినగర్‌లలో పాదయాత్ర నిర్వహించి నేరుగా సమస్యలు తెలుసుకున్నానని అన్నారు. ముఖ్యంగా మహేశ్వరినగర్ కాలనీలో దెబ్బతిన్న ప్రధాన రహదారికి మరమ్మతులు చేపట్టాలని కోరారు. శక్తినగర్ కమ్యూనిటీహాల్ నిర్మాణం పూర్తి చేయాలన్నారు. భరత్‌నగర్ ఈడబ్ల్యూఎస్‌లో డ్రైనేజీ వ్యర్థాలను తొలగించి రోడ్డు మీదనే పడవేసి తరలించటం లేదన్నారు.

◆ దీంతో అనారోగ్యం సమస్యలు తలెత్తుతున్నాయని ఆయా ప్రాంతాల్లోని స్థానిక ప్రజలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. సమస్యలను ఎమ్మెల్యే కృష్ణారావు దృష్టికి తీసుకెళ్లి వీలైనంత త్వరగా పరిష్కారమయ్యే విధంగా కృషి చేస్తానని తెలిపారు. అదే విధంగా తొమ్మిదేళ్లలో ఎమ్మెల్యే చేసిన అభివృద్ధిని వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు అంబటి శ్రీనివాస్, జిల్లా గోపాల్, పవన్, రవీందర్, సాంబశివరెడ్డి, వీరాచారి, సాయిరెడ్డి, చిరంజీవిత, పాండురంగారెడ్డి, దీక్షిత్, నవీన్, హరిత, రమాదేవి, శాంత, సంధ్య, సుజాత తదితరులు పాల్గొన్నారు.



మూసాపేట డివిజన్‌లో స్థానికుల నుంచి తెలుసుకుంటున్న సమస్యలను శ్రావణ్‌కుమార్